# స్వయంభూ మానసహారిణి


హీరో నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న హిస్టారికల్ ప్రాజెక్ట్ 'స్వయంభూ'. ఇందులో నిఖిల్ యుద్ధవీరుడిగా నటిస్తున్నాడు. ఇది ఆయన 20వ సినిమా కావడం విశేషం. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో భువన్, శ్రీకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో సంయుక్తమీనన్ ఒక కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఆమె తన పాత్ర కోసం శిక్షణ కూడా తీసుకుంది. అలాగే, ఇందులో మరో కథానాయికగా నటిస్తున్న నభా నటేష్‌కు ఈ సినిమా షూటింగ్‌లోనే చేతికి గాయం కాగా, అది నయం కావడంతో ఆమె మళ్లీ షూటింగ్‌లో జాయిన్ అయ్యింది. గురువారం మేకర్స్ ఈ సినిమాలోని ఆమె లుక్‌ని విడుదల చేశారు. గాయం నుంచి కోలుకొని టీంలో చేరినట్టు వీడియోలో ప్రజెంట్ చేశారు. మేకర్స్ విడుదల చేసిన పోస్టర్‌లో నభా యువరాణిలా కనిపిస్తున్నది. చీరలో, నగలతో అత్యంత మనోహరంగా కనిపిస్తున్నది నభానటేష్. ఇందులో నభాది శక్తిమంతమైన పాత్ర అని లుక్ చెప్పకనే చెబుతున్నది. అత్యంత భారీ బడ్జెట్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి మాటలు: వాసుదేవ్ మునెప్పగారి, సంగీతం: రవి బస్రూర్, సమర్పణ: ఠాగూర్ మధు, నిర్మాణం: పిక్సెల్ స్టూడియోస్.



# ట్రోల్స్‌ని పట్టించుకోను



**రష్మిక** ఎప్పుడూ నవ్వుతూ కనిపిస్తుందికానీ.. నిజానికి తను చాలా సీరియస్. స్పందిచాల్సి వచ్చినప్పుడు ఘాటుగా స్పందించడం రష్మిక స్టయిల్. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో తాను నటించిన 'యానిమల్' సినిమా ఏ స్థాయి హిట్టో ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. అలాగే ఈ సినిమాపై వచ్చినంత ట్రోల్స్ కూడా ఈ మధ్య ఏ సినిమాకూ రాలేదు. కొందరైతే బహిరంగ విమర్శలకే దిగారు. ఈ క్రమంలోనే రష్మికపై కూడా పలు విమర్శలొచ్చాయి. ముఖ్యంగా రణ్‌బీర్‌కపూర్‌తో తను నటించిన కార్వా చౌత్ సన్నివేశం బాగా ట్రోల్‌కి గురైంది. ఆ సీన్‌లో రష్మిక నటన అసంపూర్ణంగా ఉందనీ, డైలాగ్ కూడా అర్థంకాలేదని పలువురు ట్రోల్ చేశారు. కానీ రష్మిక మాత్రం వాటిపై స్పందించలేదు. అయితే.. 'యానిమల్' విడుదలైన నాలుగు నెలల తర్వాత తాజాగా ఆ ట్రోల్స్‌పై రష్మిక మౌనం వీడింది. నేహా దూపియా షోలో ఈ ట్రోల్స్‌కి సరైన సమాధానం ఇచ్చింది నేషనల్ క్రష్. 'మహిళల శరీరపై ట్రోల్ చేసేవాళ్లంటే నాకు అసహ్యం. 'యానిమల్' సినిమా విషయంలో నా ముఖంపై, నా నటనపై, నా డైలాగ్ డెలివరీపై చాలామంది చాలా రకాలుగా ట్రోల్ చేశారు. అందులో కార్వాచౌత్ సీన్ సినిమాకే హైలైట్. తొమ్మిది నిమిషాల నిడివి గల ఆ సన్నివేశాన్ని కేరక్టర్‌లోకి వెళ్లిపోయి ఏకబిగిన నటించాను. ఆ ఎమోషన్‌నుండి బయటి రావడానికి చాలా టైమ్ పట్టింది. ఆ సీన్ చేశాక, లొకేషన్‌లో అందరూ క్లాప్స్ కొట్టారు. అభినందనలతో ముంచెత్తారు. థియేటర్‌లో కూడా అదే అప్లాజ్. చిత్రమేంటంటే.. కొందరు ఆ సీన్ పైనే ట్రోల్స్ చేశారు. దానికి నేనేం బాధ పడలేదు. అందరికీ అన్ని నచ్చాలని లేదు. ఎవరి అభిరుచి వాళ్లది. కానీ ఆ సీన్ చేయడానికి నేను పడ్డ కష్టం వారికి ఏం తెలుస్తుంది. అంత పెద్ద సన్నివేశంలో ఒక డైలాగ్ దగ్గర నా ఎక్స్‌ప్రెషన్ బాలేదని విమర్శించారు. నా పనితీరు ఎలా ఉందో నాకు తెలుసు. సో.. వీటిని పట్టించుకోవాల్సిన అవసరం నాకు లేదు.' అంటూ ఘాటుగా స్పందించింది రష్మిక.



# తండేల్ పోరాటాలు

నిర్మాణంలో ఉండగానే భారీ అంచనాలున్న సినిమా 'తండేల్'. గీతా ఆర్ట్స్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడన్న విషయం తెలిసిందే. 'లవ్‌స్టోరీ' తర్వాత నాగచైతన్య, సాయిపల్లవి కలిసి నటిస్తున్న చిత్రం కావడంతో సినిమాపై అంచనాలు ఆకాశంలో ఉన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా నడుస్తున్నది. హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్‌లో ఈ సినిమాకోసం అతిభారీ పాకిస్తానీ జైల్ సెట్‌ని నిర్మించారు. ఈ సెట్‌లో భారీ యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు చెందు మొండేటి చిత్రీకరిస్తున్నారు. 'యానిమల్' సినిమా యాక్షన్ కొరియోగ్రాఫర్ సుప్రీం సుందర్ ఈ సినిమాకు యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా పనిచేస్తుండటం విశేషం. పాకిస్తానీ జలాల్లోకి ప్రమాదవశాత్తూ ప్రవేశించి అరెస్ట్ చేయబడ్డ మత్స్యకారునిగా ఇందులో నాగచైతన్య నటిస్తున్న విషయం తెలిసిందే. ఆ సన్నివేశాలనే ఈ సెట్‌లో చిత్రీకరిస్తున్నారట. కొన్ని రోజులపాటు జరిగే ఈ షెడ్యూల్‌తో చిత్రీకరణ కొంతభాగం పూర్తవుతుంది. నాగచైతన్య కెరీర్‌లో అత్యంత భారీ బడ్జెట్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ స్వరాలందిస్తున్న విషయం తెలిసిందే.

# నాన్నకోసం ప్రయాణం..



అమరేశ్, ప్రార్థన సందీప్ జంటగా నటించిన చిత్రం 'సత్య'. వాలీ మోహన్‌దాస్ దర్శకుడు. ఫొటో జర్నలిస్ట్ శివ మల్లాల శివమ్ మీడియా పేరుతో చిత్రనిర్మాణ సంస్థను స్థాపించి తొలి ప్రయత్నంగా ఈ చిత్రాన్ని తెలుగుప్రేక్షకులకు అందిస్తున్నారు. త్వరలో సినిమా విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా గురువారం హైదరాబాద్‌లో ఈ చిత్రం టీజర్‌ని, పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మాత శివ మల్లాల మాట్లాడుతూ 'అందరు పిల్లలూ నాన్న మనకేం ఇచ్చాడు అని ఆలోచిస్తారు. కానీ నా సినిమాలో హీరో మాత్రం తను నాన్నకి ఏవన్నా ఇవ్వాలని కోరుకుంటాడు. నాన్నకోసం ప్రయాణం మొదలుపెడతాడు. ఈ సినిమాను చాలామంది నిర్మాతలు తెలుగులో విడుదల చేయడానికి ప్రయత్నించినా, సతీశ్‌గారు నాకిచ్చిన మాటకు కట్టుబడి నన్ను నమ్మి నాకు ఈ సినిమా ఇచ్చారు. నిర్మాతగా నా ప్రయాణం ఈ సినిమాతో మొదలైంది. ఇకనుంచి నా సంస్థనుంచి మంచి సినిమాలే వస్తాయి' అన్నారు. తమిళంలో 'రంగోలి' పేరుతో విడుదలైన ఈ సినిమా పెద్ద సక్సెస్ అయ్యిందని, తెలుగులో కూడా ఘనవిజయం సాధించడం ఖాయమని, ఓ లక్ష్యంతో ముందు కెళ్తున్న శివ కచ్చితంగా నిర్మాతగా సక్సెస్ అవుతాడని తమిళ వెర్షన్ నిర్మాత సతీశ్ నమ్మకం వెలిబుచ్చారు. 'సత్య' నా కెరీర్‌లోనే స్పెషల్ మూవీ. ఎందుకంటే దర్శకుడిగా నాకిది తొలి సినిమా. ఇలాంటి మంచి సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులకు కూడా చేరవకావడం ఆనందంగా ఉంది' అని దర్శకుడు సంతోషం వ్యక్తం చేశారు. ఇంకా చిత్ర యూనిట్‌తోపాటు. జర్నలిస్టులు ప్రభు, టీవీ9 లక్ష్మీనారాయణ, సినీజోష్ రాంబాబు, బీఏ రాజు శివ, తదితరులు మాట్లాడారు.

# నేను కీర్తన అలరిస్తుంది

చిమటా రమేశ్‌బాబు స్వీయ దర్శకత్వంలో నటించి చిత్రం ' నేను కీర్తన'. రిషిత, మేఘన హీరోయిన్లు. చిమటా లక్ష్మీకుమారి నిర్మాత. త్వరలో సినిమా విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఈ సినిమా టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. నిర్మాతల మండలి ప్రధాన కార్యదర్శి టి.ప్రసన్నకుమార్, తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, 'రజాకార్' సినిమా దర్శకుడు యాటా సత్యనారాయణ ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో దర్శకుడిగా, హీరోగా బాధ్యతల్ని నిర్వర్తించానని, బ్లాక్‌బాస్టర్‌గా నిలిచే చిన్న చిత్రాల జాబితాలో ఈ సినిమా కూడా నిలుస్తుందని, పాటలు, పోరాటాలు సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయని చిమటా రమేశ్‌బాబు చెప్పారు. ఇంకా చిత్ర యూనిట్‌సభ్యులందరూ మాట్లాడారు. సంధ్య, జీవా, విజయరంగరాజు, జబర్దస్త్ అప్పారావు, తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: కె.రమణ, సంగీతం: ఎం.ఎల్.రాజా.





# ఈ మధ్యకాలంలో నేను చూసిన బెస్ట్ ఫిల్మ్ ఇదే

మలయాళంలో ఇండస్ట్రీ హిట్‌గా నిలచిన సర్వైవల్ థ్రిల్లర్ 'మంజుమ్మల్ బాయ్స్'. దాదాపుగా 200కోట్ల గ్రాస్ కలెక్షన్లను వసూలు చేసిందీ సినిమా. స్టార్స్ లేకుండా ఇన్ని వసూళ్లను రాబట్టడం నిజంగా చరిత్ర. సౌబిన్ షాహిర్, గణపతి, ఖలీద్ రెహమాన్, శ్రీనాథ్ భాసి ప్రధాన పాత్రధారులు. చిదంబరం ఎస్.పొదువల్ దర్శకుడు. పరవ ఫిలింస్ పతాకంపై బాబు షాహిర్, సౌబిన్ షాహిర్, షాన్ ఆంటోని నిర్మించిన ఈ చిత్రం తమిళంలో కూడా మంచి విజయం సాధించడం విశేషం. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచిలి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ నెల 6న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో చిత్ర యూనిట్‌తో పాటు నిర్మాతలు వివేక్ కూచిభొట్ల, శశిధర్ రెడ్డి, నిరంజన్‌రెడ్డి అతిథులుగా హాజరై సినిమా తెలుగులో కూడా అఖండ విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. ఈ మధ్య కాలంలో తాను చూసిన బెస్ట్ ఫిల్మ్ ఇదే నని, తెలుగులో కూడా పెద్ద విజయం సాధించడం పక్కా అని నిర్మాతల్లో ఒకరైన నవీన్ యర్నేని నమ్మకం వ్యక్తం చేశారు. తమకు ఇంత గొప్ప స్వాగతం పలికిన అందరికీ దర్శకుడు చిదంబరం కృతజ్ఞతలు తెలిపారు.







